# 'కార్గిల్ యుద్ధాన్ని' వ్యతిరేకిద్దాం !

**మిత్రులారా!**

యుద్ధం ప్రభుత్వ సమస్య కాదు. మనందరి సమస్య.

యుద్ధాన్ని గురించిన ఆలోచన, నిర్ణయాలు ప్రభుత్వానికి వదిలేసి మనం దేశభక్తితో చప్పట్లు కొట్టే పాత్రకు పరిమితంకాకూడదు.

ఇది ఎప్పుడయినా సత్యమే. కానీ అణుయుద్ధ ప్రమాదం పెరిగిన తరువాత మరీ సత్యం. మామూలు యుద్ధంలో ప్రత్యక్ష ప్రమాదం ఎదుర్కొనేది ఇరుదేశాల సైనికులే కాబట్టి (సరిహద్దు ప్రజలను మినహాయిస్తే) యుద్ధ నిర్ణయాలను సైన్యానికీ, ప్రభుత్వానికీ వదిలేయడం తగునని మాటవరసకైనా అనవచ్చు. అదికూడా మాటవరసకే తగును. కానీ అణుయుద్ధమంటూ వస్తే ప్రమాదం ఎదుర్కొనేది సైన్యాలు మాత్రమే కాదు. సరిహద్దుకు చాలా దూరంలో మారుమూల ప్రాంతాలలో నివసించే ప్రజలు సహితం ఎదుర్కొంటారు. ఈ స్థితి రెండుదేశాల ప్రజలకూ తెచ్చి పెట్టిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఇప్పుడు దేశభక్తితో చప్పట్లు కొట్టే పాత్రకు మనల్ని పరిమితం కమ్మంటే మనం ఎంత మాత్రమూ కానక్కరలేదు.

'కార్గిల్ యుద్ధం' అని ఇప్పటికే కొన్ని పత్రికలు పేరు పెట్టిన ప్రస్తుత యుద్ధ వాతావరణాన్ని గురించి రెండు విషయాలు మాత్రం ప్రభుత్వం, పత్రికలు పదేపదే చెప్తున్నాయి. ఒకటి పాకిస్తాన్ దుర్బుద్ధి, రెండు మనవాళ్లు దానిని సకాలంలో గ్రహించలేకపోవడం.

ఇవికాక తెలుసుకోవలసిన విషయాలు ఇంకేమీ లేవా? కాశ్మీర్‌లో ఉన్న అసంతృప్తిని వాడుకొని 'చొరబాటుదారులు'అని మనమూ, 'విముక్తి పోరాటకారులు' అనివాళ్లూ పిలుచుకునే సుశిక్షితులయిన సాయుధ మిలిటెంట్లను కాశ్మీర్‌లోకి పంపించాలని పాకిస్తాన్ ఈ రోజేకాదు, ఎప్పటినుండో ప్రయత్నిస్తున్నది. 1947 లో మొదటి భారత్-పాక్ యుద్ధం అట్లాగే మొదలయింది. 1965లో రెండవ యుద్ధం కూడ అట్లాగే మొదలయింది. 1989 లో కాశ్మీర్‌లో మిలిటెన్సీ మొదలయిన తరువాత కొన్ని వందల మంది చొరబాటుదార్లను పాకిస్తాన్ పంపించింది, లేదా వాళ్లు పోతుంటే అన్ని విధాలా సహకరించింది. ఇప్పుడు కార్గిల్‌లో పాకిస్తాన్ చేపట్టిన పని దీనికి కొనసాగింపే. కొత్త విషయమేమిటంటే మొట్టమొదటిసారి పాకిస్తాన్ కార్గిల్ సరిహద్దును ఎంచుకుంది. ఇంతకుముందు బారాముల్లా, కుప్వారా, రాజోరి, పూంచ్ సరిహద్దుల మీదుగా పంపించింది. అంతే కాకుండా ఒక్కసారిగా ఇంత ఎక్కువ సంఖ్యలో మిలిటెంట్లను పాకిస్తాన్ గతంలో ఎప్పుడూ పంపించినట్టు లేదు.

ఈ తేడాలను మినహాయిస్తే, 1947 నుండీ భారత్-పాకిస్తాన్‌ల వైరంలో ఒక సామాన్య విషయంగా ఉంటున్న ఈ సమస్య గురించి అదుపు తప్పిన ఈ ఆవేశం ఎందుకు?

కాశ్మీర్ లో భారత ప్రభుత్వం పట్ల తీవ్రమైన అసంతృప్తి ఉన్న మాట సత్యం. భారతదేశం నుండి బయటకు వెళ్లిపోవాలన్న ఒక బలమైన కాంక్ష కాశ్మీర్ ప్రజానీకంలో ఉన్న మాట కూడా సత్యం. దానిని పాకిస్తాన్ వాడుకోవడం, ఆయుధ శిక్షణ కోరుకునే కాశ్మీరీలకు శిక్షణ ఇవ్వడం, కాశ్మీర్ లోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్న పాకిస్తానీ, అఫ్ఘానీ 'ముజాహిద్' లకు సహకరించడం, పనిలో పనిగా వారితోబాటు పాకిస్తానీ సైనికులను కూడా సరిహద్దు దాటించడం జరుగుతున్నది.

దీనిని దుర్బుద్ధి అనేట్టయితే 'తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీల అసంతృప్తిని భారత్ ఇదే విధంగా వాడుకుంద'ని పాకిస్తాన్ అనగలదు. 'జాఫ్నాలోని తమిళుల అసంతృప్తిని ఒక దశ వరకు భారత్ ఇదే విధంగా వాడుకుంద'ని శ్రీలంక కూడ అనగలదు. దుర్బుద్ధో, సద్బుద్ధో గానీ ఇది అంతర్జాతీయ రాజకీయాలలో సార్వత్రికంగా ఉన్న విషయం. ఒకదేశంలోని సమస్యలను పొరుగుదేశం వాడుకొని దానిని బలహీన పరచాలని ప్రయత్నం చేస్తుంటుంది. 'మా అంతర్గత వ్యవహారాలలో దోక్యం చేసుకొని మా సార్వభౌమత్వాన్ని అతిక్రమిస్తున్నారు' అని వీరు చట్టం మాట్లాడితే, 'మీ చేత అణచివేతకు గురవుతున్న విప్లవోద్యములయిన మీ దేశ ప్రజలకు మేము అండగా నిలుస్తున్నాం' అని వారు నీతి మాట్లాడతారు. పాకిస్తాన్ వాస్తవాధీన రేఖను దాటి మిలిటెంట్లను పంపిస్తున్నదన్న విషయం ఎంత సత్యమో, ఆ మిలిటెంట్లను కాశ్మీర్ లోయవాసులు ఆదరిస్తున్నారనేది కూడా అంతే సత్యం. వారిలోని వైమనస్యానికి అసంతృప్తికి మన దగ్గర సమాధానం లేనంత కాలం దానిని పాకిస్తాన్ వాడుకోకుండ ఆపడం సాధ్యంకాదు.

పాకిస్తాన్ కపటత్వం మనదేశంలో అందరికీ ఆగ్రహం కలిగించడాన్ని అర్థం చేసుకోవచ్చు. మిలిటెంట్లనూ అందులో భాగంగా పాకిస్తానీ సైనికులనూ వాస్తవాధీన రేఖ దాటిస్తూ, అదేమంటే 'కాశ్మీర్ విముక్తి కోసం పోరాడే మిలిటెంట్లు మీ దేశంలోకి ప్రవేశించి మిమ్మల్ని ఇబ్బంది పెడితే పాకిస్తాన్ మీద పడి ఏడుస్తారెందుకు?' అని సర్తాజ్ అజీజ్ అంటున్నాడు. భారత్ ఇరకాటానికి పాకిస్తాన్ ఆనందిస్తూ, అందులో తన పాత్ర ఏమీ లేదని బుకాయించడం మనకు కోపం కలిగించగల విషయమే.

కానీ పాకిస్తాన్ బాంగ్లాదేశ వేర్పాటుకు ప్రతీకారం తీర్చుకుంటున్నదని మనలో చాలా మందికి అర్థంకావడం లేదు. "తూర్పు పాకిస్తానీల అసంతృప్తి నుండి పుట్టిన సమస్యను తాము ఏదో ఒక విధంగా పరిష్కరించుకునేవాళ్లమనీ, భారత్ జోక్యం చేసుకొని 'ముక్తి బాహిని'కి తర్ఫీదు ఇచ్చి ఆ పరిష్కారం సాధ్యంకాకుండా చేసింద"నీ పాకిస్తాన్ అభియోగం. అప్పుడు మనం ఈ మాటే అన్నాం. 'మీ దేశంలో సగభాగం మీ రాజ్యం మీద తిరగబడితే వారినేమీ చేయలేక మా మీదపడి ఏడుస్తారెందుకు?' అన్నాం.

ఇవన్నీ చెప్పడం ఎందుకంటే, ఇది ఉద్రేకానికి లోనయి యుద్ధం మీదికి తెచ్చుకోవలసిన విషయం కాదు. 'కార్గిల్'కు పరిష్కారం కాశ్మీర్‌లో ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో జమ్ముకాశ్మీర్‌లో పౌర ప్రభుత్వం ఏర్పడిన తరువాత, కాశ్మీరీల మనసులను గెలుచుకోవడానికి ప్రయత్నం చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. 1952 ఢిల్లీ ఒడంబడికను పునరుద్ధరించి ఆ పిదప జరిగిన అన్ని శాసన సవరణలనూ వెనక్కి తీసుకోవడం మొదటి మెట్టుగా ఉంటుందని ఫరూఖ్ అబ్దుల్లా అన్నాడు. దానికోసం ఒక కమిటీ కూడా వేసారు. ఆ ప్రయత్నం ఎక్కడి దాకా వచ్చిందో తెలీదుగానీ ఆ దిశగా ముందుకుపోయి కాశ్మీరీల మనస్సులను గెలుచుకోగలిగితేనే 'చొరబాటుదార్ల' సమస్య తీరే అవకాశం ఉంది.

అంతవరకు ఉద్రేకం విడిచిపెట్టి చొరబాటుదారులను వెనక్కి పంపించి వాస్తవాధీనరేఖ దగ్గర శాంతి నెలకొల్పే కర్తవ్యాన్ని ఎంత మెలకువగా నిర్వహిస్తే అంత మంచిది. సమస్య లోతుపాతులు అర్థం చేసుకోకుండా మితిమీరిన జాతీయవాద ఉద్రేకంతో దేశమంతా రెచ్చిపోతే ఇరుదేశాలకు ప్రమాదరకమయిన యుద్ధమే మిగులుతుంది. గతంలో జరిగిన యుద్ధాలలో భారత్ గెలిచి ఉండవచ్చు. ఈసారి కూడా సాంకేతికంగా చూసుకుంటే భారతే గెలవవచ్చు. కానీ అణుబాంబులొచ్చిన తరువాత గెలుపు ఓటములు అర్థం లేని మాటలు. అణుయుద్ధానికి అర్థం సార్వత్రిక విధ్వంసమే.

ఇదంతా కాదన్నా, రాగల యుద్ధాన్ని జమ్ము-కాశ్మీర్ వాసుల కళ్లతో మనం చూడగలిగినా యుద్ధంలో పరాక్రమం, వీరత్వం ఏమీలేవనీ అది భయానికీ బాధకూ విధ్వంసానికీ సంకేతమనీ అర్థమవుతుంది. ఒకనెల పైగా సాగుతున్న 'కార్గిల్ యుద్ధం' ధాటికి ద్రాస్ పట్టణవాసులు ఊరు ఖాళీ చేసి పరిసర గ్రామాలలో తిండీ తిప్పలు లేకుండా శరణార్థులుగా బతుకుతున్నారు. కార్గిల్ పట్టణ వాసులయితే రెండు సంవత్సరాలకు పైగా పాకిస్తాన్ తుపాకీ గుండ్లను ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్కరుగా ఆ ఊరిని ఖాళీ చేసిపోతున్నారు. అదే మోతాదులో కాకున్నా కాశ్మీర్‌లోయలోని కుప్వారా, ఉడి పట్టణవాసులూ, జమ్మూ ప్రాంతంలోని రాజోరి, పూంచ్ పట్టణవాసులూ ఎప్పుడు అవతలి వైపు నుండి తుపాకిగుండు వచ్చి పడుతుందోనని భయపడుతూ బతుకుతున్నారు. పొలానికో స్కూలుకో పోయిన పిల్లలు క్షేమంగా తిరిగొస్తారా లేక సరిహద్దు గుళ్లవర్షంలో ఏదో ఒక తుపాకిగుండుకు బలిఅవుతారా అని ప్రతి సాయంత్రం ఆదుర్దాగా ఎదురుచూస్తూ ఏళ్ల తరబడి బతుకులీడుస్తున్న సరిహద్దు జనావాసాల తల్లిదండ్రుల కళ్లతో చూడగలిగితే (వారిలో హిందువులున్నారు, ముస్లింలున్నారు, కాశ్మీర్ భారతదేశంలోనే ఉండాలనుకునే వారున్నారు, వేరయిపోవాలనుకునే వారున్నారు) యుద్ధమంటే మన దినపత్రికలు అతిశయించిన దేశభక్తితో వర్ణిస్తున్నట్లు పరాక్రమం, త్యాగం, ఆత్మార్పణం కాదనీ యుద్ధమంటే హింస, భయం, విధ్వంసం అనీ అర్థం చేసుకోగలుగుతాం. మన నాయకులూ పత్రికలూ నూరిపోస్తున్న వీరావేశం గురించి కార్గిల్ వాసులు ఏమనుకుంటున్నారో ఒకసారి ఆలోచించినా ఈ ఆవేశం ఎంత అసంబద్ధమైనదో అర్థమవుతుంది.

అందువల్ల ఆవేశం తగ్గించుకొని కొంచెం సంయమనం పాటిద్దాం - పాటించమని ప్రభుత్వానికి చెబుదాం. లోతయిన చారిత్రక మూలాలున్న ఈ సమస్యను ఉద్రేకంతో పరిష్కరించే ప్రయత్నం చేయొద్దనీ విధ్వంసాన్ని ఆహ్వానించవద్దనీ చెబుదాం. ఈ రెండు దేశాలలోనూ ఉన్న మూర్ఖుల పట్లు నుండి రెండు దేశాల భవితవ్యాన్నీ విముక్తి చేయడానికి ప్రయత్నం చేద్దాం.

**మానవహక్కుల వేదిక**
**(Human Rights Forum)**

***తేది 19-6-99***

*ముద్రణ : వేణు ఆఫ్‌సెట్ ఒంగోలు ఫోన్ : 39877*